ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-7-2025 సమయం:13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలోని ZPTC, MPTC, గ్రామ పంచాయతీల సంఖ్యను ప్రభుత్వం ఖరారు చేసింది.

2. అభ్యసన సామర్థ్యాల అంశంలో జనగామ జిల్లా జాతీయ స్థాయి పురస్కారాన్ని గెలుచుకుంది.

3. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులను నివారించేందుకు మరికొన్ని విద్యుత్ ఉప కేంద్రాలు నిర్మించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.

4. రాష్ట్రంలో రానున్న 2 రోజుల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవవచ్చని వాతావరణ శాఖ తెలియజేసింది. 11 జిల్లాలకు యెల్లో అలర్ట్ జారీ చేసింది.

**జడ్పీటీసీ**

రాష్ట్రంలో జిల్లా , మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు , గ్రామ పంచాయతీలను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. రాష్ట్రంలో 566 జడ్ పీటీసీలు , 5 వేల 773 ఎంపీటీసీలు , 12 వేల 778 గ్రామ పంచాయతీలు ఉన్నట్లు వెల్లడిస్తూ , ఉత్తర్వులు జారీ చేసింది. అయితే , మేడ్చల్-మల్కాజ్ గిరి జిల్లాలోని అయిదు జడ్పీటీసీలు పురపాలక సంఘాలుగా మారడంతో ఆ జిల్లాను ఈ జాబితా నుంచి మినహాయించింది. ఇలా ఉండగా, హైకోర్టు ఆదేశాల మేరకు వచ్చే సెప్టెంబర్ లోగా గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించవలసి ఉన్నందున

ఎన్నికల సామగ్రితో సిద్ధంగా ఉండాలని పంచాయతీ రాజ్ శాఖ ఆయా జిల్లాల కలెక్టర్లకు సూచించింది.

డెస్క్

..........

**జనగామ**

అభ్యసన సామర్థ్యాల అంశంలో జనగామ జిల్లా జాతీయ స్థాయి పురస్కారాన్ని గెలుచుకుంది. దక్షిణ భారతదేశంలో కేరళలోని కొన్ని జిల్లాలను మినహాయిస్తే మిగిలిన ఏ రాష్ట్రాలకు ఈ పురస్కారం దక్కలేదు. ఈ జిల్లా మూడవ తరగతిలో 16వ స్థానం, ఆరులో 35, 9వ తరగతిలో 33వ స్థానంలో నిలిచింది. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 781 జిల్లాలలో సర్వే నిర్వహించి 50 జిల్లాలను ఎంపిక చేసింది. అందరికీ నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో కేంద్రం పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ (పిఆర్ఎస్) సర్వేలు నిర్వహిస్తోంది. ఏ తరగతిలో నేర్వవలసిన అంశాలను ఆ తరగతిలోనే నేర్చుకోవడం ప్రధానమని భావించిన కేంద్రం ఈ కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ... తాను అదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ గా ఉన్న సమయంలో చేపట్టిన కార్యక్రమాలను జనగామలో ప్రవేశపెట్టి , సత్ఫలితాలు సాధించినట్టు చెప్పారు. ఉపాధ్యాయుల సహకారం, విద్యార్థుల పట్టుదలతో కేవలం 6 నెలలోనే 25 కార్యక్రమాలు అమలు చేసినట్టు కలెక్టర్ చెప్పారు.

డెస్క్/పిటిసి జనగామ

**భట్టి-విద్యుత్**

రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులను నివారించేందుకు కొత్త ఉప కేంద్రాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంబంధిత అధికారులకు సూచించారు. వీటి నిర్మాణ క్రమంలో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించాలని ఆదేశించారు . ఈ అంశంపై సంబంధిత ఉన్నతాధికారులతో ఆయన నిన్న సమీక్షించారు. సబ్ స్టేషన్ ల నిర్మాణానికి స్థలం కొరత ఉంటే , ప్రస్తుత 12.5

మిలియన్ యూనిట్ల ట్రాన్స్ ఫార్మర్ల స్థానంలో 16 మిలియన్ యూనిట్ల ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ లో పూర్తిస్థాయిలో భూగర్భ కేబుళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు.

డెస్క్

**పొంగులేటి**

భద్రాది – కొత్తగూడెం జిల్లా, అశ్వారావు పేటలో రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ ఉదయం పర్యటించారు. పట్టణంలోని సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అంతర్ రాష్ట్ర సరిహద్దులోని ఈ పట్టణాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. దొంతికుంట చెరువు పరిసరాల్లో రింగ్ బండ్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచేందుకు , మురుగు నీటిని శుద్ధి చేసే ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. స్థానిక శాసనసభ్యులు జె.ఆదినారాయణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**<u>బైట్ ... పొంగులేటి శ్రీనివాస రావు</u>**

పిటిసి, భద్రాది కొత్తగూడెం

**సిట్ - బండి సంజయ్**

ఫోన్ టాపింగ్ విషయంలో జరుగుతున్న విచారణకు ఈనెల 24వ తేది న తాను హాజరవుతున్నట్లు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలియజేశారు. తన ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆయన చేసిన పిర్యాధు మేరకు విచారణకు హాజరు కావలసిందిగా సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ విచారణకు తాను పూర్తిగా సహకరిస్తానని ఇప్పటికే వెల్లడించారు.

పిటిసి, కరీంనగర్

**దామోదర**

ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు జరిగేందుకు లబ్ధిదారులతో సమన్వయం చేసుకోవాలని  వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. సంగారెడ్డిలో గత రాత్రి జరిగిన పార్టీ కార్యకర్తల   సమావేశంలో మాట్లాడుతూ ఆయన... ఇందిరమ్మ ఇండ్లు , రేషన్ కార్డుల పంపిణీ  ,  ఉచిత విద్యుత్ ,  రైతు భరోసా ,  సన్న బియ్యం పంపిణీ తదితర కార్యక్రమాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ఆయన కోరారు.

పిటిసి, సంగారెడ్డి

**BREAK**

ఆకాశవాణి  ప్రాతీయ  వార్తలు వింటున్నారు. మరిన్ని  Updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్"  handle @ airnews_hyd ని ఫాలో అవండి.  AIR News Hyderabad YouTube Channel కి సబ్ స్క్రైబ్ చేయండి.

**కొండా సురేఖ**

రాష్ట్రంలో తమ శాఖ పరిధిలోని పెద్ద ఆలయాల వార్షిక బడ్జెట్ కు ఇకపై ప్రభుత్వ అనుమతి తప్పనిసరని దేవాదాయ శాఖ మంత్రి        కొండా సురేఖ చెప్పారు. బడ్జెట్ కేటాయింపుల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయన్న ఆరోపణలపై ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెపారు.  ఈ మేరకు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఆయా ఆలయాల నుంచి వచ్చే బడ్జెట్ ప్రతిపాదనలను దేవాదాయ శాఖ ఆమోదించేది.

డెస్క్

**టీబీ గవర్నర్**

టీబీ ముక్త్ భారత్ అభియాన్ సమర్థంగా అమలు కావడానికి అందరూ భాగస్వాములు కావాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ   పిలుపునిచ్చారు. ఈ దిశగా ప్రభుత్వ యంత్రాంగం చేపట్టే కార్యక్రమాలు విజయవంతం కావడానికి సహకరించాలని అన్నారు. ఆయన నిన్న నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో  ఆ పథకంపై సమీక్షించారు. సాహిత్య, సేవా, క్రీడా, సామాజిక రంగాలకు చెందిన వారు తమత మాధ్యమాల ద్వారా క్షయ వ్యాధి నిర్మూలకు కృషి చేయాలని గవర్నర్ కోరారు.

పీటీసీ...మంచిర్యాల

...............

**క్షయ వ్యాధిగ్రస్తులు**

క్షయ వ్యాధిగ్రస్తులు సకాలంలో మందులు వేసుకోవడంతో పాటు  పోషక ఆహారం తీసుకోవడం ద్వారా సత్వరం కోలుకోవచ్చని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం కింద పౌష్టికాహార కిట్ లను ఈరోజు అంద   జేశారు. స్వచ్ఛంద, కార్పొరేట్ సంస్థలు క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకోవడానికి ముందుకు   వస్తే ఈ వ్యాధిని సత్వరం నియంత్రించడం సాధ్యమవుతుందన్నారు.    జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పీటీసీ, వరంగల్

...........

**ఆయిల్ ఫామ్ - నిర్మల్**

నిర్మల్ జిల్లాలో మూడేళ్లుగా సాగు చేస్తున్న ఆయిల్ ఫామ్ పంట కోతకు వచ్చిందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రమణ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రైతులు ఆయిల్ పామ్ గెలలను కోసి మార్కెట్ కు తరలించారని , వారి ఖాతాలలో నగదు జమ అయిందని ఆమె ఆకాశవాణికి చెప్పారు.

**బైట్ ... ఉద్యానవన శాఖ అధికారి రమణ**

పిటిసి, నిర్మల్

**పరిహారం**

వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్ నిర్మాణం , అభివృద్ధి పనులలో భూమి కోల్పోయిన వారికి త్వరితగతిన పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. ఖిలా వరంగల్ , ఉర్సు, ఎనుమాముల, గొర్రెకుంట ప్రాంతాల వారికి ఈ పరిహారం అందవలసి ఉంది. ఇన్నర్ రింగ్ రోడ్ పనుల ప్రగతిపై కలెక్టర్ ఈరోజు సమీక్షించారు.

పీటీసీ, వరంగల్

**కరీంనగర్ (బైట్)**

కరీంనగర్ జిల్లాలో ఈ సీజన్ లో 3.28 లక్షల ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి చెప్పారు. 2.76 లక్షల ఎకరాల్లో వరి, 48 వేల ఎకరాల్లో మొక్కజొన్న , 4 వేల ఎకరాల్లో కంది సాగు చేయటానికి ప్రణాళికలు రూపొందించామని ఆమె తెలిపారు.

బైట్ ... వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి

పిటిసి, కరీంనగర్

**వాతావరణం**

రాష్ట్రంలో వచ్చే రెండు రోజుల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవవచ్చని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంగా గాలులు వీచవచ్చని పేర్కొంది. జగిత్యాల, సిరిసిల్ల, జనగాం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, సిద్ధిపేట, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది. కాగా, ఆల్మట్టి,

నారాయణపూర్ నుంచి  నీరు వదలడంతో శ్రీశైలం , నాగార్జున సాగర్ జలాశయాలకు వరద నీరు నిలకడగా కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాల కారణంగా దిగువ ప్రాజెక్టులకు నీటి చేరిక పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్పారు.

డెస్క్

**ఉప్పల్ ఫ్లై ఓవర్**

హైదరాబాద్ లోని ఉప్పల్  – నారపల్లి మధ్య ఫ్లై ఓవర్ ను వచ్చే ఏడాది దసరా నాటికి అందుబాటులోకి తెస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు. 2017 లో ప్రారంభమైన సుమారు 8 కిలో మీటర్ల మేర ఫ్లై ఓవర్ పనులకు కారణాంతరాల వల్ల అంతరాయం కలిగిందని ఆయన అన్నారు. ఈ నిర్మాణంపై ప్రగతిని ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు.

డెస్క్

**ఉట్నూర్ ఐటీడీఏ పీవో**

ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలో అనీమియా వ్యాధి నివారణకు గతంలో మాదిరిగా కలిసికట్టుగా పని చేయాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కుష్బూ గుప్త కోరారు.

**సౌండ్ బైట్ ... ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కుష్బూ గుప్త**

పిటిసి, ఆసిఫాబాద్

**CLOSING**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు ఇంతటితో సమాప్తం. తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.